క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

అరకులోయ రూరల్: ఎంపీపీ రంజపల్లి ఉషా రాణి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సంబంధిత అధికారులు ఆయా శాఖల పూర్తి వివరాలతో ఉదయం 10 గంటలకు విధిగా హాజరు కావాలని తెలిపారు.

కలసికట్టుగా పనిచేస్తే అభివృద్ధి


ఎంపీపీ కడబాల ఆనందరావును కలసిన ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: అందరూ కలసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ కడబాల ఆనందరావు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో కె.బాపన్నదొర మంగళవారం ఎంపీపీ చాంబర్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎంపీపీ తన చాంబర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధిపై చర్చించారు. ప్రస్తుతం జ్వరాల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో శానిటేషన్‌పై దృష్టి సారించామన్నారు. మంచినీటి పథకాల పైపులైన్లు లీకేజీలు, తదితర తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కరణం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై శ్రద్ధ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

కొయ్యూరు: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైనా దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ మోహన్ సూచించారు. వ్యక్తిగత శుభ్రత ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. స్థానిక గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లోను విద్యార్థులు రాణించాల్సి ఉందన్నారు. క్రీడలు ద్వారా శారీరక దారుఢ్యం పెరుగుతుందని, ఆటలు కూడా ఆడాలని సూచించారు. ఈ ఏడాది పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమన్నారు.

ప్రీ స్కూల్ పిల్లలకు సర్టిఫికెట్ల ప్రదానం


రచ్చపల్లిలో పిల్లలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్యకర్త

జి.మాడుగుల: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. స్కూల్ జాయినింగ్ పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లను అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదానం చేశారు. మండలంలో గొందిమెలక, కృష్ణాపురం, నీలిమెట్ట, రచ్చపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రూ.3 లక్షలతో బోరు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రామన్న

అరకులోయ రూరల్: మండలంలో బస్కీ పంచాయతీ పరిధి పడిగుడ, చాపరాయివలస గ్రామాల్లో మండల పరిషత్ నిధుల నుంచి రూ.3 లక్షలతో తాగునీరు బోరు పనులను వైస్ ఎంపీపీ రామన్న మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో తాగునీరు సమస్య ఉన్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి

గిరిజనుల వేడుకోలు


ఊటగెడ్డ నీరు పడుతున్న మహిళ


ఊట నీటిని సేకరిస్తున్న గిరిజనులు

చింతపల్లి రూరల్: మండలంలో లంబసింగి పంచాయతీ చక్కరాయిబంద గ్రామంలో తాగునీటి సమస్య తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆ గ్రామాన్ని సందర్శించి తాగునీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో గిరిజనులు నీటి సమస్యతో సతమతమవుతున్నారని, దూరంగా ఉన్న ఊటనీరే దిక్కుగా జీవిస్తున్నారని వాపోయారు. చెత్తాచెదారం కలిసి నీరు కలుషితం అవుతుండటంతో రోగాలు బారిన పడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుని తక్షణమే చెక్కరాయిబంద గ్రామానికి తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు.

అరకులోయ రూరల్: మండలంలో మాదల పంచాయతీ దాబుగుడ గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని తక్షణమే సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకుడు రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన మంచినీరు పథకం నిరుపయోగంగా మారిందన్నారు. దాంతో తాగునీరు కోసం మైల దూరం వెళ్లి ఊట గెడ్డలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అక్కడ కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు పథకం వినియోగంలోకి తెచ్చి రక్షిత మంచినీరు అందించాలని కోరారు.

అంకితభావంతో విధుల నిర్వహణ


మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: అంకితభావంతో విధులను నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని సచివాలయాల సిబ్బందికి ఎంపీడీవో కె.బాపన్నదొర సూచించారు. మండలంలోని సచివాలయాల సిబ్బందితో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మలేరియా జ్వరాల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ప్రతీ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి సారించామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో కలసి దోమల నివారణ మందు పిచికారీ, యాంటీ లార్వా స్ప్రే, ఫాగింగు వంటి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై దృష్టి సారించి, పైపులైన్ల లీకేజీలు, మంచినీటి పథకాల లీకేజీలు వంటి వాటికి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. సచివాలయంలో అన్ని రకాల ప్రజా సేవలు సకాలంలో అందించాలని సూచించారు. మండలంలోని అన్ని సచివాలయాల కార్యదర్శులతోపాటు, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫాం పంపిణీ


పుస్తకాలు, యూనిఫాం అందజేస్తున్న హెచ్‌ఎం

ఎటపాక: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. మంగళవారం గౌరీదేవిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు హెచ్‌ఎం శ్రీశైలం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న పథకాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కణితి శేఖర్, శ్రీను, వినోద్‌కుమార్, స్వరాజ్యం పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మత్స్యలింగంకు ఘన సత్కారం


ఎమ్మెల్యే మత్స్యలింగంకు దుశ్శాలువాతో సన్మానిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, తదితరులు

అరకులోయ టౌన్: డుంబ్రిగుడ మండల ప్రజాప్రతినిధులు మంగళవారం అరకులోయ శరభగుడ కాలనీలోని తన నివాసంలో శాసన సభ్యుడు రేగం మత్స్యలింగంను మర్యాద పూర్వకంగా కలిశారు. డుంబ్రిగుడ జెడ్పీటీసీ చటారి జానకమ్మ, ఎంపీపీ బాక ఈశ్వరి ఆధ్వర్యంలో మహిళా నేతలు ఎమ్మెల్యేకు దుశ్శాలువా కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇంత ఘన విజయం సాధించినందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి ఉందన్నారు. ప్రజలకు మంచి పాలన అందించాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేకు కలిసిన వారిలో వైస్ ఎంపీపీ పంచాడి లలిత, ఎంపీటీసీలు గుజ్జెలి విజయ, ఎల్. వరహాలమ్మ, మహిళా మండల అధ్యక్షురాలు బంగురు శాంతి, తదితరులున్నారు.

నేడు సికిల్ సెల్ ఎనీమియా అవగాహన ర్యాలీ

ముంచంగిపుట్టు: సికిల్ సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. ర్యాలీ అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ వ్యాధి పట్ల అనుమానం ఉన్న వారు కచ్చితంగా ఉచిత పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

స్కూల్ చిన్నారులపై ప్రత్యేక దృష్టి

సీడీపీవో విజయగౌరి


గ్రాడ్యుయేషన్ డేలో చిన్నారులకు సన్మానాలు

ఎటపాక: ప్రైమరీ స్కూల్ చిన్నారులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎటపాక ప్రాజెక్ట్ సీడీపీవో విజయగౌరి సూచించారు. మంగళవారం వైటీసీ భవనంలో ప్రీస్కూల్ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సెంటర్ నుంచి ప్రైమరీ స్కూల్‌కి వెళ్లే చిన్నారులకు టీసీలు ఇచ్చారు. అనంతరం సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లలకు ఆటపాటలతో విద్య అందించామని చెప్పారు. పాఠశాలకు వెళ్లే చిన్నారులు ఏ విధంగా నడుచుకోవాలో వారి పట్ల తల్లిదండ్రులు ఎటువంటి బాధ్యత, అప్రమత్తత కలిగి ఉండాలో తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధమ్మ, రాజు, పవన్, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో భారీ వర్షం

కొయ్యూరు: ఉరుములు, మెరుపులతో మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో భారీ వర్షం కురిసింది. దీని మూలంగా గంటకుపైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపించాడు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగుల భయం ప్రజలను వెంటాడింది.

ఇంటింటి కుళాయిల ప్రారంభం


బిందెనీరు అందిస్తున్న సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లిలో జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను సర్పంచ్ సాగిన ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ కుళాయిల మూలంగా చీడపల్లికి తాగునీటి సమస్య తీరిందని చెప్పారు. ప్రతి ఇంటికి కుళాయి నీరు రావడంతో కాలువకు వెళ్లి తెచ్చుకోవాల్సిన బాధ తప్పిందన్నారు. ఇక నుంచి గ్రామస్తులు సురక్షితమైన తాగునీటిని తాగవచ్చని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబానికి సహాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు

రంపచోడవరం: స్థానిక ఎస్టీ కాలనీలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పండా రామకృష్ణదొర ఆధ్వర్యంలో చేయూతనందించారు. పాట్నెటీ దుర్గాప్రసాద్‌రెడ్డి కుటుంబాన్ని మంగళవారం వారు పరామర్శించారు. నిత్యావసరాలు, కొంత నగదును అందజేశారు. తక్షణమే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆపదలో ఎవరున్నా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆదుకునేందుకు ఎప్పుడూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగా బొజ్జయ్య, ఉప సర్పంచ్ వీఎం కన్నబాబు, పార్టీ యువజన నాయకుడు రాపాక సుధీర్, జిల్లా ఉపాధ్యక్షురాలు కాపారపు రూతు, దూడ స్మిత్, డొక్కులూరి రత్నరాజు, మంగా తమ్మన్నకుమార్, హేము, అబ్రహం, రామారావు, నాగు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహం ఏర్పాటుకు చర్యలు

గొలుగొండ: కృష్ణదేవిపేటలోనిఅల్లూరి మైత్రి గ్రంథాలయం వద్ద అల్లూరి విగ్రహం ఏర్పాటు కు కమిటీ సభ్యులు అంగీకారం తెలిపినట్లు గ్రంథాలయం వ్యవస్థాపకులు శర్మ మాస్టారు, కొయ్యూరు పూర్వ సీఐ సోమశేఖర్‌లు తెలిపారు. గ్రంథాలయం వద్ద మంగళవారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే నెల 4న ఆరడుగుల అల్లూరి విగ్రహాన్ని గ్రంథాలయం వద్ద ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

డయేరియా నిర్మూలనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి తిరుపతిరావు

కొయ్యూరు (కె.కోటపాడు): పిల్లల్లో వచ్చే నీళ్ల విరోచనాలు వ్యాధి(డయేరియా)ని నిర్మూలించడానికి అంతా కృషి చేయాలని కె.కోటపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం డయేరియా నిర్మూలన కార్యక్రమంపై ఆరోగ్య సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి వెళ్లి సర్వే చేసి డయేరియాతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి చికిత్స అందించాలన్నారు. తీవ్రత ఉన్న వారిని ఆస్పత్రికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రమైన మంచినీరు, ఆహారం తీసుకోవాలన్నారు. బయట దుకాణాల్లో దొరికే ఆహార పదార్థాలు తినరాదని, ఈ విషయాన్ని పిల్లల తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

జి.మాడుగులలో ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన, విక్రయం


మాట్లాడుతున్న తహసీల్దారు గోపాలకృష్ణ

జి.మాడుగుల: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి రైతులు పంటలు పండించి ప్రజలకు విక్రయించటం వల్ల అందరికీ ఆరోగ్యకరంగా ఉంటుందని తహసీల్దారు వీవీవీ గోపాలకృష్ణ, ఐకేపీ ఏపీఎం సుందరమ్మ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ సమీపాన మంగళవారం ప్రకృతి వ్యవసాయ పంటల ప్రదర్శన, విక్రయ శాల ఆకట్టుకుంది. భీరం, సొలభం, నుర్మతి, పంచాయతీలోని గ్రామాల నుంచి రైతులు తీసుకొచ్చి విక్రయించారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఏపీఎం మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలను ఇక్కడకు తీసుకొచ్చి విక్రయించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రతి రైతు తమకున్న భూమిలో సేంద్రియ పద్ధతుల్లో జీవామృతం, కషాయాలు వంటి వాటితో వ్యవసాయం చేయాలన్నారు. ఆహార ఉత్పత్తులను రసాయన ఎరువులు, పురుగుల మందుల నుంచి వచ్చే అనర్థాల నుంచి కాపాడుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన పంట పండించుకుని తాము ఉపయోగించుకుని మిగతాది విక్రయించుకోవాలన్నారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడటం వల్ల ఆరోగ్యం పాడు చేసుకోవటమే కాకుండా భూసారం తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డ్వాక్రా మహిళలతో అనుసంధానంగా పనిచేస్తుందని ప్రతి గ్రామ వీవో పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీ రాజారావు, వెంకయమ్మ, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జులు మేడ ప్రసాద్, ఎస్. రామలింగం, ఐసీఆర్పీలు సత్యవతి, సింహాచలం, కొండమ్మ, సోమన్నదొర, కుమారి, ఎర్రయ్యదొర పాల్గొన్నారు.

వరదలను సమర్థంగా ఎదుర్కోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్

వీఆర్‌పురం: వచ్చే జూలై, ఆగస్టు నెలల్లో గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండల స్థాయి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్‌మౌలానా ఫాజిల్ తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో వరద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరదల సమయంలో ఏయే గ్రామాలు తొలుత ముంపునకు గురవుతాయి, ఆయా గ్రామాల వరద బాధితులను ఏయే ప్రాంతానికి తరలిస్తారు, తదితర విషయాలపై సమీక్షించారు. ప్రజా ప్రతినిధుల చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి, ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

పంటల నిల్వ కేంద్ర భవనం సిద్ధం

- రూ.15 లక్షలతో నిర్మాణం
- రైతులకు తీరనున్న కష్టాలు


పంటల నిల్వకు సిద్ధమైన భవనం

కొయ్యూరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో దూరదృష్టితో ఆలోచించి నిర్మించిన పంటల నిల్వ కేంద్ర భవనం సిద్ధమైంది. ఇంతవరకు పండిన పంటను నిల్వ చేసుకునే అవకాశం లేక చాలా మంది రైతులు పొలాల్లోనే గిట్టుబాటు ధర వచ్చినా రాకున్నా విక్రయించేస్తారు. అలాంటి రైతుల కష్టాలు కొంత వరకు తొలగనున్నాయి. సింగవరం ఐటీడీఏ కాలనీ సమీపంలో రైతులు పంటలను నిల్వ చేసుకునేందుకు భవనాన్ని నిర్మాణం చేశారు. ఉద్యాన శాఖ, డీఆర్‌డీఏ సంయుక్తంగా రూ.15 లక్షలతో దీనిని నిర్మాణం చేశాయి. కలెక్షన్ సెంటర్‌గా పిలిచే దీనిలో రైతులు పండించిన వివిధ రకాల పంటలను గిట్టుబాటు వచ్చేంత వరకు నిల్వ చేసుకోవచ్చు. లాభాలు వస్తున్నప్పుడు దానిని విక్రయించుకోవచ్చు. చాలా మంది రైతులకు పంటను నిల్వ చేసుకునే అవకాశం లేక నష్టమో లాభామో ఆశించకుండా పంటను అమ్మేస్తున్నారు. ఇప్పుడు నిల్వ కేంద్రం మూలంగా ఎన్ని రోజులైనా ఉంచుకునే అవకాశం కలిగింది. దీనిపై వెలుగు ఏపీఎం ఈశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ రైతులు పంటను నిల్వ చేసుకునేందుకు భవనం అందుబాటులోకి వచ్చిందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘానికి చెప్పి అవసరమైన రైతుల పంటలను నిల్వ చేస్తామన్నారు. దీనిని విద్యుత్, నిర్వహణ ఖర్చుల కోసం తక్కువ డబ్బులు చెల్లిస్తే సరిపోతుందన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

75 మందికి వైద్య సేవలు


బడదనాంపల్లిలో వైద్య శిబిరానికి వచ్చిన రోగులు

రాజవొమ్మంగి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బడదనాంపల్లి, చినరెల్లంగిపాడు గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 75 మంది రోగులను పరీక్షించినట్లు డాక్టర్ సరోజ్ తెలిపారు. వర్షాకాలం సమీపించడంతో రోగాలు వ్యాప్తిచెందకుండా అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. జ్వరం వస్తే వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకి వచ్చి రక్తపరీక్షలు చేయించుకోవాలని కోరారు. బీపీ, సుగర్ సమస్యలు ఉన్నవారికి, గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఎంఎల్‌హెచ్‌పీ సంపత్, ఏఎన్‌ఎం మహేశ్వరి, బాలమ్మ, హెచ్వీ రమాబాయి, 104 డీఈవో శ్రీనివాస్, పైలట్ కనకరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

జి.మాడుగుల: అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి. సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీజీఆర్‌ఎఫ్, ఏపీఈపీడీఎల్ ఆధ్వర్యంలో బుధవారం పాడేరు ఏపీఈపీడీఎల్ పరిధి చింతపల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సమావేశానికి సాంకేతిక సభ్యుడు వీ జనార్దనరావు, ఆర్థిక సభ్యుడు ఎం శ్రీనివాస్, స్వతంత్ర్య సభ్యుడు డాక్టర్ ఆర్ సురేంద్రకుమార్ హాజరవుతారన్నారు.

‘పర్తియాత్రకు సత్యసాయి భక్తులు తరలిరండి’

భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు


వేచలంలో సత్యసాయి భక్తులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు

దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్ 23 నుంచి 25 వరకు జరిగే పర్తియాత్రకు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా వేలాదిగా ఉన్న సత్యసాయి భక్తులు తరలి రావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని వేచలంలో మండల స్థాయి సత్యసాయి సేవా సమితి సమావేశం మంగళవారం జరిగింది. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుండి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగనుందన్నారు. ఈ యాత్రకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చేలా కృషి చేయాలన్నారు. కుటుంబ నారాయణ సేవ, శ్రీ సత్యసాయి లక్ష గృహ నామ సంకీర్తన, గ్రామ సేవలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని సూచించారు. సమావేశంలో విశాఖపట్నం జిల్లా ఆధ్యాత్మిక సమన్వయకర్త జక్కాన సూర్యనారాయణ, దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడు ఆదిరెడ్డి చినకన్నబాబు, నాడు అప్పారావు, సీహెచ్‌వీ రవిశంకర్, గంధం సూర్యం, భక్తులు పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతుల్ని విజయవంతం చేయండి


మాట్లాడుతున్న లోకనాథం

చోడవరం రూరల్: ఈ నెల 22, 23 తేదీల్లో చోడవరంలో జరప తలపెట్టిన సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల విజయవంతానికి అన్ని వర్గాలు సహకరించాలని జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీపీఎం నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పలు ఉద్యమాలు, పోరాటాలు చేస్తోందని, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, సహకార చక్కెర కర్మాగారాల ఆధునికీకరణ కోసం తమ పార్టీ అండగా నిలిచిన సంగతిని గుర్తు చేశారు. రంగాల వారీగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సీపీఎం అలుపెరుగని పోరాటాలు చేస్తోందన్నారు. చోడవరంలోని కల్యాణ మండపంలో జరగనున్న పార్టీ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల నిర్వహణ, విజయవంతానికి స్థానిక ప్రజలు, వ్యాపార వర్గాలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు డి.వెంకన్న, ఎస్‌వీ నాయుడు, వీవీ శ్రీనివాసరావు, జి.నాయనబాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.